క్లుప్తంగా

ఘనంగా శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



బనగానపల్లె : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి పల్లకీ సేవా నిర్వహించారు.

యువత చేతుల్లో దేశభవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి

కోవెలకుంట్ల: దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణదాసు, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, రాజు, దేవి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం రాజయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన కర్నూలు జరిగిన జిల్లాస్థాయి అండర్–14, 17 విభాగాల్లో పాఠశాలకు చెందిన అబ్దుల్ రహిమాన్, షంషీర్, సురేంద్రబాబు, దినేష్‌లు సత్తాచాటారన్నారు. జిల్లాస్థాయిలో రాణించడమే కాకుండా త్వరలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.విజేతలను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు శ్రీపతి, శివశంకర్‌రెడ్డి, నాగేశుడు, సుగుణ, జహిరాబీ, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బనగానపల్లె రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శుక్రవారం తెలిపారు. 12వ తేది కర్నూలు ఔట్ డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ హర్షవర్ధన్‌రెడ్డి అండర్ -17 విభాగం అథ్లెటిక్స్‌లో హైజంప్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే బనగానపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎం పరమేష్ అండర్-14 చెస్ పోటీల్లో, ఆర్ సాయిరాంనాయక్ అండర్-14 ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామలక్ష్మీ శుక్రవారం తెలిపారు.

రేపు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

● లింగాలకు ఎమ్మెల్యే కాటసాని రాక

కోవెలకుంట్ల: మండలంలోని లింగాల గ్రామంలో రూ. 32 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభోత్సవం చేస్తారని సర్పంచ్ వెంకటసుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు డీవీ శేషిరెడ్డి చెప్పారు. ఎస్సీ కాలనీలో రూ. 10 లక్షల డీఎంఎఫ్ నిధులతో సీసీరోడ్డు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రూ. 8 లక్షలతో డ్రైనేజీ నిర్మించారన్నారు. అదేవిధంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 14 లక్షలతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

18న కురుక్షేత్ర మహా సంగ్రామ సభ

బేతంచెర్ల: ఏపీ ఎమ్మార్పీయస్ అధ్యక్షుడు దండు వీరయ్య ఆధ్వర్యంలో ఈనెల 18న ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్రంలోని దేవి ఫంక్షన్ హాలులో జరిగే కురుక్షేత్ర మహా సంగ్రామ సభ ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీయస్ రాష్ట్ర కార్యదర్శి రాజయ్య పిలుపునిచ్చారు.శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్పీయస్ కార్యాలయంలో సభకు సంబంధించిన కరపత్రాలను జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల మద్దిలేటి, టౌన్ అధ్యక్షుడు నత్తి జయరాజ్, ప్రధాన కార్యదర్శి మద్దయ్య తదితరులు విడుదల చేశారు.

పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



కొలుములపల్లెలో రోగులకు మందులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, నాయకులు

డోన్ రూరల్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందజేస్తున్నారని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దొరపల్లి గ్రామంలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు ప్రజలకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగిన హెల్త్ క్యాంప్‌లో 822 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్లు తెలిపారు. హెల్త్ క్యాంప్‌ను సందర్శించిన కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు మారుమూల గ్రామాలల్లోనూ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇళ్ల వద్దనే వైద్య సేవలు కల్పించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామచంద్రుడు, జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌యాదవ్, సర్పంచ్ గంగాదేవి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష... దేశానికే ఆదర్శం

బేతంచెర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్ రెడ్డి, గూని నాగరాజు అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని కొలుములపల్లె గ్రామంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్, సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఎంపీటీసీ మరియమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ఎంపీపీ ప్రారంభించారు. వైద్యులు మౌనిక, శాంతి, వెంకటేశ్వర్లు, వంశీ కృష్ణ, రమణమూర్తి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు బుగ్గన కుమార్‌రెడ్డి, గూని నాగరాజు, శేఖరయ్య, బల్లాని సూర్య, తిమ్మయ్య, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లు సుప్రవల్లిక, ఫిరోజ్, జయేంద్రారెడ్డి, ఈ.ఎన్.టి స్పెషలిస్ట్ చిన్న లింగన్న, జనరల్ సర్జన్ రాజేష్‌లు ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. అదేవిధంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముక్కమళ్ల పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్లు సుబ్బరాజ, తెరిసమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

ప్యాపిలి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిందని జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి అన్నారు. మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. సర్పంచ్ రంగస్వామి హాజరైన ఈ కార్యక్రమంలో 525 మందికి వైద్య పరీక్షలు చేశారు. 12 మందిని వివిధ ఆసుపత్రులకు సిఫారసు చేశారు. వైద్యాధికారులు నితీశ్, నుస్రత్ ఉ జొహర, జార్జ్, పావని తదితరులు ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, డీటీ మారుతి, ఎస్ రంగాపురం సర్పంచ్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ రామానాయుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి రక్ష కల్పిస్తోందని ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పుష్పకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయ పరిధిలోని వల్లంపాడు, పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల, ఎం. గోవిందిన్నె గ్రామాలకు చెందిన 534 మంది ఓపీ నమోదు చేసుకున్నారు. కోవెలకుంట్ల సీహెచ్‌సీ, రేవనూరు, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటలక్ష్మి, మహబూబ్‌సుభాని, రాబర్ట్ కెన్నెడి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రాధిక, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడిన హెల్త్ క్యాంప్

బనగానపల్లె : పట్టణంలోని సచివాలయం-5 పరిధిలో శుక్రవారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ ప్రారంభించారు. వైద్య పరీక్షల నిమిత్తం ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో హెల్త్ క్యాంప్ కిటకిటలాడింది. డాక్టర్లు శివశంకరుడు, సోహెల్‌బాబు, ఫిరోజ్, లక్ష్మీ శైలజ తదితర సిబ్బంది 1,057 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్, అస్తామా, గుండె, కీళ్ల నొప్పులు రోగులు అత్యధికంగా వచ్చినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, ఈఓ ఖలీల్, ఈఓఆర్డీ గురుప్రసాద్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఈసారి యల్లయ్య, నీలి శ్రీనివాసులు, పోలూరు వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం అండగా ఉన్నాడు

దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కొడుకుగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నాడు. ప్రత్యేకించి గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నాడు. పల్లెల ప్రజలకు మెరుగైన వైద్యం అందజేయడం అభినందనీయం. వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందజేయడం చాలా మంచి ఆలోచన.

– ఎం, రామయ్య,బలపాలపల్లె గ్రామం



ప్యాపిలిలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్



చిన్నకొప్పెర్లలో ఓపీ నమోదు చేసుకుంటున్న ప్రజలు



బనగానపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



శింగనపల్లెలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఉచితంగా మందులు ఇచ్చారు



జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో బీపీ, షుగర్, కంటి పరీక్షలు ఉచితంగా చేయడమే కాకుండా ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాకుండా మాలాంటి పేదల కోసం గ్రామంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– వలిసెల సామక్క, కొలుములపల్లె గ్రామం బేతంచెర్ల మండలం

వైద్య పరీక్షలు మంచిగా చేశారు...



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు మంచి వైద్య సౌకర్యం లభిస్తుంది. కొద్దిరోజులుగా కీళ్లనొప్పులు, తల నొప్పితోబాధపడుతున్నా. వైద్య శిబిరంలో డాక్టర్లు అన్ని పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు కూడా అందజేశారు. గతంలో ఈ విధమైన వైద్య సౌకర్యం ఎన్నడూ లభించలేదు. సీఎం వైఎస్‌జగన్‌కు రుణపడి ఉంటాం.

– హుస్సేన్‌బీ,పేషెంట్,భానుముక్కల

చాలా సంతోషంగా ఉంది...



గతంలో ఎన్నడు లేనివిధంగా గ్రామంలోకి వచ్చి డాక్టర్లు వైద్యం అందిస్తుండటం చాలా సంతోషంగా ఉంది. నేను జగనన్న సురక్ష క్యాంప్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్నా. ఉచితంగా మందులు అందజేశారు. పేదలకు చాలా ఉపయోగపడుతాయి.

– రామాంజినేయులు, దొరపల్లి

పైసా ఖర్చు లేకుండా వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పేదలకు ఎంతో ఉపయోగపడుతంది. నేను కూడా పైసా ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు చేయించుకున్నా. బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకోవాలంటే రూ. 5వేల రూపాయులు వరకు ఖర్చు అయ్యేది. ఇలాంటి క్యాంప్‌లు నిర్వహించడం చాలా మంచిది.

– రామేశ్వరి, దొరపల్లి గ్రామం

సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి

ప్యాపిలి: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను ఉద్యాన రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి రాజేశ్, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి హాజరైన ఈ సమావేశంలో వారు మాట్లాడారు. మినీ ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లను ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, రైతులు ఆర్బీకేలలో సంప్రదించాలన్నారు. అదేవిధంగా రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ కలిగి ఉండాలన్నారు. ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక పంటలు దెబ్బతిన్న కారణంగా ప్యాపిలిని కరువు మండలంగా ప్రకటించాలని సమావేశంలో తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు. సమావేశంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఓ రవీంద్ర సభ్యులు జనార్ధన్ రెడ్డి, యాగంటి రెడ్డి, ప్రేమసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కొండమీదపల్లె గ్రామానికి చెందిన రైతు గజ్జల శ్రీనివాసులరెడ్డి(38) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. మృతుడు శ్రీనివాసులరెడ్డి రెండేళ్ల నుంచి కొలిమిగుండ్లలో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకొని మిరప సాగు చేస్తున్నాడు. తరచూ మోటార్లు కాలిపోవడం, వ్యవసాయ ఖర్చులు అధికం కావడంతో అప్పులు అయ్యాయి. దీంతో దిక్కుతెలియక ఇంట్లో విషగుళికలు తిని అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు. పోలీసులు మృతికి గల కారణాలు తెలుసుకొని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. రైతు శ్రీనివాసులరెడ్డి మృతి విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొండమీదపల్లెకు చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



ఏనుగుమర్రి గ్రామంలో పర్యటిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

ప్యాపిలి: ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. సచివాలయం ఆవరణలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లు వేసుకున్న రైతులు తమకు విద్యుత్ సౌకర్యం, మోటార్ సౌకర్యం కల్పించాలన్నారు. స్పందించిన అర్జున్ రెడ్డి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన గ్రామ సమీపంలోని కొత్త చెరువు, సర్దార్ కుంటలను పరిశీలించారు. మంత్రి చొరవతోనే తమ గ్రామంలోని చెరువులు జలకళను సంతరించకున్నాయని గ్రామస్తులు మంత్రి తనయుడికి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ కరణం మదన్‌మోహన్, ప్యాపిలి ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, బాలయ్యన్న, వైఎస్సార్ సీపీ నాయకులు కొండయ్య, ప్రవీణ్, అరిగెల అంజి, కరణం నాగరాజు, పోలీసు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హేమసుందర్ రెడ్డి

డోన్ టౌన్: బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డోన్‌కు చెందిన కొత్తకాపు హేమసుందర్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లా అధ్యక్షునిగా హేమ సుందర్ రెడ్డి రైతుల అభివృద్ధి పాటుపడిన కృషికి తగిన గుర్తింపు లభించిందని నాయకులు అభినందనలు తెలిపారు.

సింగర్ పార్వతిని అభినందించిన ఎంపీపీ

బేతంచెర్ల: కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన సింగర్ పా ర్వతిని శుక్రవారం ఎంపీపీ బుగ్గన నాగభూష ణం రెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అభినందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు శేఖరయ్య , గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సన్మానం

ప్యాపిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన సీఎం రాకేశ్‌ను స్థానిక సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్‌ఐ రాజ్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఎస్‌ఐకి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

ఉన్నత స్థితికి చేరుకోవాలి

బనగానపల్లె రూరల్ : డిగ్రీ విద్యార్థులు పట్టుదల, క్రమ శిక్షణతో చదివి ఉన్నతి స్థితికి చేరుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సాబీహా బేగం సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలతదేవి అధ్యక్షతన నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమం జరిగింది.

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



దసరా శరన్నవరాత్రి మహోత్సవాల బుక్‌లెట్ విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని కొండపేటలో వెలసిన శ్రీ వాసవికన్య కాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే శ్రీ మత్కన్యకాపరమేశ్వరిదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు విజయవతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాథంశెట్టి వేణుగోపాల్, సెక్రటరీ శ్రీరామవెంకట సుబ్రహ్మణ్యలు కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్యవైశ్య భవనంలో మహోత్సవాల బుక్‌లెట్‌ను సంఘం సభ్యులతో కలిసి వారు ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో మొదటిరోజు అమ్మవారు శ్రీ స్వర్ణకవచాలాంకృత శ్రీదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తారన్నారు. అదేవిధంగా 16న శ్రీ బాల త్రిపుర సుందరిదేవి, 17న శ్రీగాయత్రిదేవి, 18న శ్రీ అన్నపూర్ణ దేవి, 19న శ్రీమహాలక్ష్మీదేవి, 20న శ్రీసర్వస్వతిదేవి, 21న శ్రీలలితా త్రిపుర సుందరిదేవి, 22న శ్రీదుర్గాదేవి, 23న శ్రీమహిషాసుర మర్ధినిదేవి, శ్రీరాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనమిస్తారన్నారు. 24న దశమి రోజు శ్రీవాసవిమాత రథోత్సవం, 25న వసంతోత్సవం, పాన్పుసేవ, తోట్ల పూజ, 26న చల్లముద్ద కార్యక్రమాలతో దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలు ముగుస్తాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్‌ఎస్ నారాయణ, డాక్టర్ రవికుమార్, నూకలవిజయుడు, ఎన్ వెంకటేశ్వర్లు,నూకల వెంకసుబ్బయ్య, జంగంశెట్టి, టంగుటూరు శ్రీనివాసులు,డి వెంకట సుబ్బయ్య, జక్కానాగరాజు, రామక్రిష్ణయ్య, శివయ్య, ఫణిభూషన్, బలరామయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యాకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదిరోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. మొదటి రోజున అమ్మవారు రాజరాజేశ్వరీదేవి, 16తేదీన అన్నపూర్ణాదేవి, 17న మహాగౌరిదేవి, 18న లలితాదేవి, 19న ధనలక్ష్మిదేవి, 20న సరస్వతీదేవి, 21న గజలక్ష్మిదేవి, 22న మహిషాసురమర్ధినిదేవి, 22న అన్నపూర్ణదేవి, 23న వాసవాంబదేవి అలంకారంలో భక్తులకు భక్తులకు దర్శనమిస్తారన్నారు. అదే రోజున విజయదశమి, శమీదర్శనం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 24వ తేదీన తులాభారం, తొట్ల ఉత్సవం, పాన్పుసేవతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు

అవుకు: మండల కేంద్రం అవుకులో ఈ నెల 15 నుంచి దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తామని ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు, తాళేపల్లె నాగేంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. 15వ తేదీన అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో దర్శనమిస్తారన్నారు.


పంట నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి

బేతంచెర్ల: సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలో ఏఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఏడీఏ వివరించారు. పంటల సాగు సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. సభ్యుల నుంచి సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్ కుమార్, వెటర్నరీ డాక్టర్ అజయ్, హార్టికల్చర్ అధికారి రఘువరన్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి



డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న పులిదామోధర్

డోన్ టౌన్ : ఏలాంటి దాపరికాలు లేకుండ ప్రతి ఒక్కటి ప్రజలకు తెలిసేలా ఉండేందుకు సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, జిల్లా సమాచార హక్కు చట్టం హైలెవల్ కమిటీ మెంబరు పులిదామోధర్ తెలిపారు. సమాచార హక్కు చట్టం 2005 దినోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో భాగంగా పులిదామోధర్ శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శ్రీనివాసరెడ్డిని కలిసిచట్టం పత్రాలను అందజేశారు. అదేవిధంగా డీఎస్పీని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టంతో ప్రతి విషయాన్ని ప్రజలు తెలుసుకోవచ్చన్నారు.

గో సంరక్షణ ప్రతివ్యక్తి కర్తవ్యంగా భావించాలి



గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: గోసంరక్షణ ప్రతివ్యక్తి కర్తవ్యంగా భావించినపుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో తిమ్మనాయినపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపట్టిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు గోపూజ, మహిళలతో కుంకుమార్చన నిర్వహించారు. సనాతన సాంప్రదాయాలు ప్రతి ఒక్కరు పాటించాలని ఆయన సూచించారు. తెలుగు పండిట్ వైవీఎస్ నారాయణరెడ్డి మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణం,మహాభారతం, భగవద్గీతలపై ప్రవచనాలు చేశారు. నందిపాడు భజన బృందం సభ్యులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్వాహకులు సుధాకర్‌శెట్టి, ఆలయ పూజారి కిషోర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం





కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్, జాబ్‌మేళాకు హాజరైన యువత

డోన్ : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జాబ్ మేళా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరుద్యోగ జాబ్‌మేళాను చైర్మన్ ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాబ్‌మేళాకు హాజరైనయువతీ యువకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పదవ తరగతి, ఆపైన చదివి ఉద్యోగాల కోసం ఎదురుచూసే విద్యావంతులందరికీ ప్రభుత్వం ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళాలను నిర్వహిస్తుందన్నారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా పలు కోర్సులలో శిక్షణ ఇచ్చి గ్యారెంటీగా ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. జాబ్‌మేళాకు 320 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కాగా, 12 కంపెనీల ప్రతినిధులు 142 మంది ఉపాధి కల్పించారని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ధారా హరినాథ్‌రెడ్డి, ఆర్జ్ రమణ, ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.